## విరుపాక్షమ్మ తల్లికి మంత్రి ప్రత్యేక పూజలు

చిన్నమండెం జూలై 19 ప్రభాతవార్త :

మండలంలోని పడమటికోన గ్రామం, బోరెడ్డిగారిపల్లెలో రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం వారింట ఇలవేల్పు శ్రీ శ్రీ విరుపాక్షమ్మ తల్లి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆదివారం వారిచ్చే విందులో భాగంగా వంటల కార్యక్రమాలను దగ్గరుండి ఏర్పాట్లను మంత్రివర్యులు పరిశీలించారు.




# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 20 జూలై 2025




ఆషాడమాసం ఉత్సవం లోభాగంగా: ఈరోజు అలంకరణ ఓం శ్రీ కనక దుర్గాదేవి నమః శ్రీ కనకదుర్గాదేవి ఆలయం బద్వేల్

# రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్. లిక్కర్ స్కాంలో బిగుసుకున్న ఉచ్చు

రాజంపేట, జూలై 19 ప్రభాతవార్త

రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని సిట్ అరెస్టు చేసింది. రాత్రి 8.30 గంటల సమయంలో అధికారికంగా మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులకు సిట్ సమాచారం అందించింది. మిథున్ రెడ్డి అరెస్ట్ కావడం ఖాయమని తెలిసిన నేపథ్యంలోనే ఆలస్యం చేయకుండా మిథున్ రెడ్డి సిట్ అధికారుల జారీ చేసిన నోటీసుల మేరకు విచారణకు వచ్చారు. రాష్ట్రాన్ని కుదిపివేసిన, వైసీపీని హడలెత్తించిన మద్యం కుంభకోణంలో నాలుగో నిందితుడిగా ఎంపీ మిథున్ రెడ్డిని సిట్ చేర్చింది. మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి పాత్ర పై పక్కా ఆధారాలు సేకరించిన సిట్ విచారణ సందర్భంగా వాటిని చూపి ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. ఇప్పటికే ముందస్తుబెయిల్ కోసం అటు హైకోర్టులో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో సుప్రీంకోర్టును మిథున్ రెడ్డి ఆశ్రయించారు. అక్కడ కూడా బెయిల్ ఇవ్వలేమని,అరెస్టును అడ్డుకోలేమని స్పష్టం చేయడంతో విధిలేని పరిస్థితిలో, అరెస్టుకు సిద్ధమై సిట్ ఎదుట ఎంపీ హాజరయ్యారు. ఎంపీ కి చెందిన నిర్మాణ సంస్థలకు మద్యం కుంభకోణం సొమ్ము అయిదు కోట్లు జమ అయిన నేపథ్యంలో ఎంపీ ఇరుక్కున్నారు. లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి కీలక సూత్రధారిని సిట్ కోర్టు వాదనల్లో స్పష్టం చేసింది. 3500 కోట్ల మద్యం కుంభకోణం కేసులో 4వ నిందితునిగా ఉన్న మిథున్ రెడ్డికి సంబంధించిన పాత్ర పై 20 రోజుల్లో చార్జిషీట్ నమోదు చేస్తామని సిట్ ప్రకటించింది. ఆదివారం ఆయన్ను కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలుస్తోంది. రాజంపేట రాజకీయాల్లో మిథున్ రెడ్డి అరెస్టు కలకలం రేపింది. ఆయన అరెస్టు సర్వత్ర చర్చనీయాంశం మారింది. రాజంపేట పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన ఏ నాయకుడు ,ఇంతవరకు కోర్టు కేసులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కోలేదు.





## పాలేటమ్మ తల్లికి బోనాలు

చిన్నమండెం జూలై 19 ప్రభాత వార్త:

మండలంలోని , కలిబండ గ్రామంలో వెలసిన ..శ్రీ శ్రీ పాలేటమ్మ తల్లికి శనివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. మరియు కుటుంబ సభ్యులతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు అభిమానులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.



# జరిమానాల కోసమే కాదు... ప్రాణాలను కాపాడటం కోసం కూడా...



జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలు



ద్విచక్ర వాహనదారులను హెచ్చరిస్తున్న పోలీసులు



రాజంపేట పాత బస్టాండ్ లో వాహన తనిఖీలు

రాజంపేట, జూలై 19 ప్రభాతవార్త

రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.ప్రతి పౌరుడి బాధ్యత. జరిమానాల కోసమే కాదు.ప్రాణాలను కాపాడటం కోసం కూడా అనే నినాదంతో అన్నమయ్య జిల్లాలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లి వద్ద ఈనెల10న జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తే మామిడికాయలు కోసేందుకు వచ్చిన కూలీలు లోడ్ చేసిన తర్వాత లారీ పైన కూర్చున్నారు. ప్రమాదంలో మొత్తం లారీ కిందపడి 11 మంది మరణించారు. అదే పోలీసులు ముందస్తుగా హెచ్చరించి ఉంటే ఎక్కడైనా తనిఖీలు చేసి ఉంటే ప్రాణాల పోయేవి కాదు. అయితే అర్ధరాత్రి జరిగిన సంఘటన నేపథ్యంలో పోలీసులు నిందించడం కాదు కానీ ఇలాంటి స్పెషల్ డ్రైవర్ వల్ల డ్రైవర్లు నిబంధనలు పాటించే అవకాశం కూడా ఉంది. అరటి, బొప్పాయి, మామిడికాయల లారీల డ్రైవర్లు కూలీలను లారీ పైభాగాన నేటికీ కూర్చోబెట్టడం ప్రమాదాలకు కారణం అవుతోంది. ఇలాంటి సంఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించడం జరిగితే ప్రమాదాలను నివారించేందుకు ఎక్కువ ఆస్కారం. వీటన్నిటినీ పరిశీలించిన తర్వాతే తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుడంతో రహదారి భద్రతపైజిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. 11 మంది కూలీలను బలిగొన్నరెడ్డిపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం, అంతకు ముందు రాయచోటి ప్రాంతంలోనూ ,ఇతర ప్రాంతాల్లోనూ రోడ్డు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో కర్నూల్ డీఏజీ కోయ ప్రవీణ్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. డీఐజీ ఆదేశాలతో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు రహదారి భద్రతపై దృష్టి సారించారు. ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, ట్రాఫిక్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ డ్రైవ్‌ల ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా పోలీసు యంత్రాంగం స్పష్టం చేస్తోంది. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై వాహనాల వేగాన్ని పర్యవేక్షిస్తున్నారు. నిర్ణీత వేగ పరిమితిని మించిన వారిపై చలాన్లు విధిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూస్తున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి జరిమానాలు విధిస్తున్నారు. కార్లలో ప్రయాణించే డ్రైవర్లు, ముందు సీటులో కూర్చునే వారు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరని హెచ్చరిస్తున్నారు. దీనిపై కూడా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేస్తున్నారు. వస్తువులు లేదా ప్రయాణికులను మోసుకెళ్లే వాహనాలు అధిక లోడుతో వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మామిడి వంటి పంటల రవాణా సమయంలో లారీలు, ఇతర వాహనాల్లో అధిక లోడు, కూలీలను టాప్ మీద ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలకు దారితీస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా నిరోధించడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు.ఈ డ్రైవ్‌ల ద్వారా ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించడమే పోలీసుల ప్రధాన లక్ష్యంగా స్పష్టం చేస్తున్నారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అధికారులు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమను తాము కాపాడుకోవడమే కాకుండా ఇతరులను కాపాడవచ్చని చెబుతున్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం, వేగ పరిమితిని పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి నిబంధనలు కేవలం జరిమానాల కోసం కాదని, ప్రాణాలను కాపాడటం కోసమని గుర్తు చేస్తున్నారు. రహదారులపై ప్రయాణించేటప్పుడు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచిస్తున్నారు.రహదారి భద్రతను పెంపొందించడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏదైనా ప్రమాదకరమైన పరిస్థితిని గమనించినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు

### ఇరువురికి తీవ్రగాయాలు

పులివెందుల, జూలై 19,ప్రభాత వార్త:





పులివెందుల నియోజకవర్గం లోని తొండూరు మండలం ఇనగనూరు గ్రామంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరులో జరిగిన ఘర్షణలో సమరసింహారెడ్డి, హరి కిషోర్ రెడ్డి అనే ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలలోకి వెళితే ఇనగనూరు గ్రామానికి చెందిన బాబు రెడ్డి మరియు సమరసింహారెడ్డిల మధ్య గతంలో నుంచి ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని ద్విచక్ర వాహనంలో వెళ్తున్న సమరసింహారెడ్డి హరికిషోర్ రెడ్డి లను సైదాపురం వద్ద కారుతో ఢీ కొట్టి రాడ్లతో ప్రత్యర్థులు తలలు పగలగొట్టారు. గాయాలు అయిన సమరసింహారెడ్డ, హరి కిషోర్ రెడ్డి లను 108 వాహనం ద్వారా పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్ కు తరలించారు. ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న సమరసింహారెడ్డి హరికృష్ణ రెడ్డి లను డీఎస్పీ మురళి నాయక్, సీఐ వెంకటరమణ, తొండూరు ఎస్సై రంగారావు పరిశీలించారు. అనంతరం సిఐ వెంకటరమణ మాట్లాడుతూ ఈ ఘర్షణ సంబంధించి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అంబేద్కర్ ప్రతిభా గురుకుల కళాశాల తనఖీ

### విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా

### విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరిక

పులివెందుల,జూలై 19, ప్రబాతవార్త:

నియోజకవర్గంలోని లింగాల మండలం ఇప్పట్ల గ్రామం వద్ద ఉన్న డా. బి ఆర్ అంబేద్కర్ ప్రతిభా గురుకుల పాఠశాల మరియు కళాశాలను శనివారం పశ్చిమ రాయలసీమ జిల్లాల పుట్టబుద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్, ఉద్యోగులు సమయపాలన పాటించాలని ,విధులలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులే స్కూల్ నందు రాజకీయాలు చేస్తే సహించేది లేదని అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అందరూ ఉపాధ్యాయులు సంగటితంగా ఉండి పాఠశాల నిర్వహించాలి అని ఉపాధ్యాయులు విద్యార్థి నులకు గుణాత్మకమైన విద్యను బోధించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులను మన కన్నబిడ్డల్లా చూసుకొని వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత గురుకుల పాఠశాల యాజమాన్యాల పైన ఉందన్నారు. విద్యార్థుల నుంచి ఎటువంటి సమస్యలు వచ్చినా సంబంధిత వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.విద్యార్థులకు మెనూ ప్రకారమే నాణ్యమైన పదార్థాలను ఇవ్వాలన్నారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకుంటూ కచ్చితంగా యూనిఫాంలోనే పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయు లకు సూచించారు.టాయిలెట్లు చుట్టూ ప్రక్కల పరిసరాలను పరిశీలించి పారిశుధ్య లోపం లేకుండా పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. ఆహార పదార్థాలు మెనూపై వంట ఏజెన్సీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటశాలను పరిశీలించి వండిన ఆహారాన్ని ,కూరలను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని తెలిపారు. అనంతరం వంట గదిలోని కూరగాయలను పరిశీలించారు. అక్కడ కొన్ని కుళ్ళి పోయిన కూరగాయలు ఉండడంతో వాటిని పరిశీలించి వెంటనే సంబంధిత సరఫరా వారితో మాట్లాడి తాజా కూరగాయలను అందించాలి అని మరొకసారి పునరావృత మైతే చర్యలు తీసుకుంటామ న్నారు. అనంతరం విద్యార్థుల తో మాట్లాడి భోజన నాణ్యత గురించి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి సమస్యలున్న భయపడకుండా తనకు తెలియజేయాలని వారిని కోరారు. పాఠశాలలో ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న వారికి పెండింగ్ లో ఉన్న జీతాలు చెల్లించే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి, తెలుగు యువత నాయకులు తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి జ్ఞానేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# టైలింగ్ పాండ్ ఎత్తు పెంచకండి

### ఆర్‌డిఓను కోరిన యురేనియం బాధిత రైతులు

పులివెందుల, జూలై 19, ప్రభాత వార్త:



ఆర్డిఓ తో మాట్లాడుతున్న యురేనియం బాధిత రైతులు

టైలింగ్ పాండ్ ఎత్తును పెంచకూడదని ఆర్డీవో చిన్నయ్య యురేనియం బాధిత గ్రామాల రైతులు కోరారు. శనివారం వేముల మండలంలోని మబ్బు చింతలపల్లి సమీపంలో ఉన్న యురేనియం కర్మాగారం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయానికి వచ్చి యురేనియం కంపెనీ నుండి వచ్చే వ్యర్థాలను నిలువ చేసే టైలింగ్ పాండ్‌ను ఎత్తును పెంచడానికి వీలు లేదన్నారు. రైతులు మాట్లాడుతూ టైలింగ్ పాండ్ పెంచడానికి మేము అనుమతి ఇవ్వము అని తెలిపారు.టైలింగ్ పాండ్ పెంచడానికి అనుమతి ఇవ్వాలంటే సంబంధించిన భూముల రైతులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని తెలిపారు. ఆ టైలరింగ్ పాండ్ వల్ల గ్రామంలో మహిళలకు ప్రజలకు ఎక్కువగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని మహిళలకు ప్రెగ్నెన్సీ రావడంలేదని ప్రెగ్నెన్సీ వచ్చిన నాలుగు, ఐదు నెలల లోపు ప్రెగ్నెన్సీ పోతుందని, ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు పశువులకు అందరికీ చర్మవ్యాధులు, అంటువ్యాధులు, కీళ్ల క్యాన్సర్ పలు రోగాలతో బాధపడుతూ ఉన్నామని తెలిపారు. టైలింగ్ పాండ్ పెంచాలంటే పూర్తిస్థాయిలో మాకు న్యాయం జరిగితేనే మేము పెంచడానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆర్డిఓ రైతులతో టైలరింగ్ ప్యాంట్ పెంచుకోవడానికి కాకుండా మరమ్మత్తుల కొరకని రెండు రోజులు మట్టి తోలుకోవడానికి అవకాశం కల్పించాలని రైతులను కోరడం జరిగినది. మరమ్మతులు చేసుకోవడానికి రైతులు అంగీకరించారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

బద్వేల్ అర్బన్, జూలై 19 ప్రభాత వార్త



స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలనీ ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి విద్యార్థులు, సిబ్బందితో ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటు పడతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరమని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను వదిలేయాలని,ఇందుకు బదులుగా ఇతర వస్తువులను వాడాలని సూచించారు. ఈ ప్లాస్టిక్ వలన అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలియజేశారు. అలాగే జీవవైవిధ్యము తగ్గుతుందనీ. ప్లాస్టిక్ ని సృష్టించడం, రీసైక్లింగ్ చేయడము రెండు విషపూరిత వాయువులు అని పేర్కొనడమైనది. తదుపరి పరిసరాల పరిశుభ్రతకు ప్లాస్టిక్ వస్తువులను అందరితో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు ఉదయ భాస్కర్ రాజు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తిట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంత చెప్పినా వినవా...!!

### అక్రమ సంబంధంతో భర్త చేతిలో భార్యహతం

చాపాడు. జూలై 19. ప్రభాతవార్త :







సమాజంలో గౌరవంగా బ్రతుకుదాం.. తప్పుడు పనులు మానుకో అని ఎంత చెప్పినా వినకపోవడం, ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కట్టుకున్న భర్త గొంతు నులిమి హత్య చేసి ముదిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో పడేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే మండల పరిధిలోని చియ్యపాడు గ్రామానికి చెందిన మృతురాలు సుజాత గోపాల్ కు స్వయానా అక్క కూతురు మేనకోడలు, వీరికి 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది ఇరువురు సంతానం గోపాల్ వృత్తిరీత్యా ప్రైవేటు డ్రైవర్ గాపనిచేస్తూ జీవనోపాధి సాగిస్తుండగా గోపాల్ భార్య మృతురాలు సుజాత ఇంటికి పరిమితం, గత కొన్ని ఏళ్లుగా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తిచియ్యపాడు లో వివాహం చేసుకొని బేల్దారి వృత్తిలో జీవనం సాగిస్తున్నాడు. సుజాతకు బాబుతో గత కొన్ని ఏళ్లుగా అక్రమ సంబంధం ఉందని తెలిసి భర్త గోపాల్ పలుమార్లు మందలించడంతోపాటు, అక్రమ సంబంధ వ్యవహారం పోలీస్ స్టేషన్ల వరకు కూడా వెళ్లడం జరిగింది. అయినప్పటికీ సుజాతలో మార్పు రాకపోవడంతో 17 వ తేదీ భార్యాభర్తల మధ్య గొడవ అనంతరం ఇంటిలోనే భర్త గోపాల్ భార్య సుజాతను గొంతు నులిమి హత్య చేసి గోనె సంచిలో మూటగట్టుకుని తన ద్విచక్ర వాహనంలో మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె అటవీ ప్రాంతంలో పడవేసినట్లు సమాచారం. రెండు రోజుల నుండి తమ కుమార్తె సుజాత కనపడకపోవడంతో తల్లి పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతురాలు సుజాత భర్త ముద్దాయి గోపాల్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా తానే సుజాతను హత్య చేసి పడేసినట్లు తెలిసింది. శనివారం సంఘటన స్థలానికి మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ తోపాటు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్, చాపాడు పోలీసులు,రెవెన్యూ సిబ్బంది, పంచనామ నిర్వహించి శవాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

బద్వేలు అర్బన్, జూలై 19, ప్రభాత వార్త

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ డీ సీ. గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో బద్వేలు మున్సిపాలిటీ వైసిపి పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. సమావేశానిక ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో స్వయంగా ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందనీ, ఒకవైపు "తల్లికి వందనం", ఉచిత గ్యాస్ వంటి హామీలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాకపోగా, మరోవైపు ప్రతి రైతుకు రూ. 20,000 చొప్పున ఇవ్వాలన్న హామీ వాయిదాల మీదే ఉంది. రెండో సంవత్సరం ప్రారంభమయినా, ఖరీఫ్ సీజన్ నడుస్తున్నా ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వైసిపి హయాంలో వర్గాల కతీతంగా సంక్షేమ పథకాలను అంకితభావంతో అమలు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అమలైన పథకాల కన్నా కొత్తగా ఒక్క పింఛన్ అయినా మంజూరు చేశారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తల్లికి వందనం పథకం కూడా వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు నిరసనల తర్వాతే గట్టి ఒత్తిడిలో అమలు అయ్యిందన్నారు. టీడీపీ ప్రచారం చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు ఏవీ పూర్తిగా అమలుకాలేదనే వాస్తవాన్ని ప్రజల ముందుంచాలనీ డిమాండ్ చేశారు. చంద్రబాబు ఇచ్చిన 143 హామీల్లో ఒక్కదైనా పూర్తిగా నెరవేరిందా? అనే ప్రశ్నను ప్రజలు నేరుగా అడుగుతున్నారు. అధికారాన్ని దక్కించుకోవాలన్న ఆసక్తితో అబద్ధాలు, హామీలు, మోసాలనే నమ్ముకుని తిరుగుతున్నారని ప్రజల్లో విమర్శలు వస్తున్నాయి. పై స్థాయిలో చంద్రబాబులోకేశ్ లా దోపిడీ చేస్తే, క్రింద స్థాయిలో



ఎమ్మెల్యేలు అదే దారి తీస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. అలాగే పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టినా ఎవ్వరూ భయపడే ప్రసక్తే లేదు. హామీలను అమలు చేయనపుడు ప్రజలే ప్రభుత్వ మెడలు వంచే రోజులు దగ్గరలో ఉన్నాయి. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ, "టీడీపీకి ఓటు వేయకపోతే పథకాలు రవు" అనే బెదిరింపుతో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటి గురించి మాట్లాడడం కూడా మానేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పార్టీ మండల అధ్యక్షుడు సుందర రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ కూడా చైర్మన్ సింగసాని గురు మోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ,రాష్ట్ర మరియు జిల్లా అనుబంధ విభాగాల నాయకులు బంగారు శీనయ్యా, యద్దారెడ్డి, తోట నాగేశ్వరరావు, రమేష్ బాబు, అల్లా బకాష్, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ పుత్తా శ్రీరాములు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగ సుబ్బారెడ్డి, పార్టీ కౌన్సిలర్లు, పలు ప్రజాప్రతినిధులు, వివిధ హోదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూముల అవకతవకలపై విచారణ చేపట్టాలి



బద్వేలు ,జూలై 19 ప్రభాత వార్త

.ఏపీఐఐసికి కేటాయించిన భూముల అవకతవకలపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలనీ, అలాగే ఏపీఐఐసీలో బినామీ పేర్లతో పాసుబుక్కులు పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతూ శనివారం సిపిఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతి పత్రం అందించారు. సందర్భంగా జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ బద్వేల్ నియోజకవర్గ కార్యదర్శి చంద్రమోహన్ రాజులు మాట్లాడుతూ, బద్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో మరియు పారిశ్రామికరణ పేరుతో గోపవరం మండలం గోపవరం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రాజెక్టు కాలనీ సొసైటీ ఆధీనంలో ఉన్న సుమారు 1500 ఎకరాల పైబడి ఉన్న భూమి ఏపీఐఐసికి కేటాయిస్తూ ఆ సొసైటీ లో ఉన్న సభ్యులకు ప్రతి మనిషికి 50 సెంట్లు ప్రభుత్వ భూమి ఇవ్వాలని గత ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను బద్వేలు నియోజకవర్గంలోని ఆనాటి కొంత మంది రాజకీయ ఉద్దండులు అవకాశంగా తీసుకుని తమకు అనుకూలమైన వారిని లబ్ధిదారుల లిస్టులో చేర్చి కోట్లాది రూపాయల విలువ చేసి ప్రభుత్వ భూములను తమ సొంతం చేసుకున్నారన్నారు.వారికి అప్పట్లో రెవెన్యూ అధికారులు సైతం సహకరించారని ఈ విషయంలో పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారాయని ప్రజలు చర్చించుకుంటున్నారని దీనిపై రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సెంచరీ పరిశ్రమ పక్కనే ఉన్న 157 సర్వేనెంబర్ లోని అత్యంత విలువైన 15 ఎకరాల స్థలాన్ని తమ హస్తగతం చేసుకోవడానికి గత ప్రభుత్వ హయాంలో కొంతమంది పెద్దలు గట్టిగా ప్రయత్నించి తమ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఈ కుంభకోణంపై ఉన్నత స్థాయి విచారణ జరిపించి అందుకు సహకరించిన సిబ్బందిపై మరియు కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఆ భూమిని కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎన్టీఆర్ గృహ సముదాయాలకు అర్హులైన పేదల ఇండ్ల స్థలాలకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. . ఈ కార్యక్రమంలో,జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్ నియోజకవర్గ నాయకులు బాబు, విజయరావు, నారాయణ, , శాంసన్, సలీం తదితరులు పాల్గొన్నారు

## పైపులను తొలగింపుకు చర్యలు,



మైదుకూరు, జులై 19, ప్రభాతవార్త:

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారైన సహాయ మార్కెటింగ్ సంచాలకులు జి. ఆజాద్ వలి,కడప వారి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మైదుకూరు వ్యవసాయ మార్కెట్ గోడౌన్లో ఉన్న పైపులను తొలగింపుకు చర్యలు చేపట్టారు.వ్యవసాయ మార్కెట్ కమిటి, మైదుకూరు నందు జి.పి. ఆర్.ఇన్,నాయక్ నగర్, క్రాస్ రోడ్, డోర్ నెం. 11147413, విద్యుత్ నగర్ సర్కిల్,అరవిందనగర్ క్రాస్, అనంతపురము వారు గోదాము నెం.1 నందు వున్నటువంటి హె.డి.పి.ఇ పైపులను జిల్లా కలెక్టరు మరియు నియోజకవర్గ యం.యల్.ఏ. పుట్టా సుధాకర్ యాదవ్ వారి ఆదేశముల మేరకు నిల్వ వున్న పైపులను తొలగింపుకు అధికారుల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టడంతో గోడౌన్ నియోజకవర్గ వ్యవసాయ రైతులకు ఉపయోగించుకోవచ్చని కార్యదర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ మైదుకూరు పి. వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



గాలివీడు, జులై 19(ప్రభాతవార్త):

గాలివీడు మండల కేంద్రంలో శనివారం అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ప్లాస్టిక్‌ని వాడటం నిలిపివేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వీటిని అమలు చేస్తే ప్రజలు మంచి వాతావరణంలోఓ ఆరోగ్యంతో జీవించడానికి వీలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజు, ఎంఈఓలు, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

నిమ్మనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నిమ్మనపల్లెలోని మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కరన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలు, ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రతినెల 3వ శనివారం ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించి పర్యావరణ పరిరక్షించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని కోరారు. ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి కాలుష్య నియంత్రణకు కృషి చేయాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య నివారణ పనులు కూడా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎంతో పాటు సిబ్బంది గుర్రప్ప, సుధాకర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా హమాలీ వర్కర్స్ యూనియన్

పీలేరు జూలై 19 ప్రభాతవార్త :





పీలేరు హమాలీ వర్కర్స్ యూనియన్ (సీపీఐ అనుబంధం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా పి.వి. రమణ, సహాయ కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా దాము ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కొత్తగా ఎన్నికైన వారు యూనియన్ బలోపేతానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 27న పీలేరులో నిర్వహించనున్న నియోజకవర్గ సీపీఐ మహాసభలను ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆలయ భూములు దురాక్రమణ పై విచారణ



రామసముద్రం జూలై 19 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలోని ఆర్ .నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం గ్రామ సమీపంలోని వాలీశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములు దురాక్రమణ కు గురైనట్లు గ్రామస్తులు ఇచ్చిన పిర్యాదు మేరకు అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ శనివారం బలసముద్రం గ్రామంలో విచారణ చేపట్టారు. ఆలయ భూములను కొందరు గ్రామస్తులు దురాక్రమణ చేసి ఇండ్లు నిర్మించు కున్నారనీ, ఎండోమెంట్ కు ఎలాంటి రుసుము చెల్లించకుండా ఆలయ భూములు సాగుచేసుకుంటున్నారనీ గ్రామస్తులు విశ్వనాథం వివరించారు.గత మహాశివరాత్రి సందర్భంగా ఏర్పడిన వాలీశ్వర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ భూములు కొన్ని ఏడాదికి లీజు ప్రాతిపతికన కేటాయింపులు చేసినా దురాక్రమణ దారులు భూములను వదలలేదని వివరించారు.వీటిపై స్పందించిన ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ భూ దురాక్రమణ దారులకు నోటీసులు ఇచ్చిన ఆలయ భూములు వదిలేయ్యాలని,లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈ ఓ రమణ,ఇన్స్పెక్టర్ శశికుమార్, విఆర్వో సాయి,సర్వేయర్ తేజు పోలీస్ సిబ్బంది శ్రీరాములు,భరత్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్లో చురుగ్గా పారిశుద్ధ్య పనులు



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలిస్తున్న టీఎం

పీలేరు జూలై 19 ప్రభాతవార్త:

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా నిర్వహించారు. రెండుమూడు రోజులుగా కురిసిన వర్షాలతో బస్టాండ్ ప్రాంగణం మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో శనివారం డిపో మేనేజర్ నిర్మల పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. చెత్తాచెదారం. పిచ్చిమొక్కలు తొలగించారు. బస్టాండ్ ప్రాంగణంలో స్తంభించిన వర్షపునీరు వెళ్లేలా మురుగు నీటి కాలువలు శుభ్రం చేపించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయులు, ఏడీసీలు బాబునాయక్, హనీఫ్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజామే లక్ష్యం



ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

పీలేరు జూలై 19 ప్రభాతవార్త :

సమిష్టి కృషితో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మండల ప్రత్యేకాధికారి కె. కృష్ణకిషోర్ అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు స్వస్తి చెబుతాంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధించవచ్చున్నారు. పట్టణ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, హోటళ్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందన్నారు. సమిష్టి కృషితో దీన్ని అరికట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఏఎంసీ చైర్మన్ రామ్మూర్తి, ఈవో లతీప్ ఖాన్, శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రాలో భాగస్వాములు అవుదాం.

రామాపురం జూలై 19 ప్రభాతవార్త

మన పాఠశాల మన ఇల్లు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం స్వచ్ఛ ఆంధ్ర లో భాగస్వాములం అవుదామని ఎంపీడీవో జాషువా పిలుపునిచ్చారు మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇల్లు మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం మన వీధి గ్రామం తద్వారా మండలం పరిశుభ్రంగా ఉంటాయన్నారు విద్యార్థులు తమ పాఠశాలను తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు గ్రామ సచివాలయ సిబ్బంది విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## డిజిటల్ వ్యవస్థలపై అవగాహన సదస్సు



రామాపురం జూలై 19 ప్రభాతవార్త

ఈ ఆధునిక డిజిటల్ యుగంలో, ఇంజనీరింగ్ విద్యార్థులు సిద్ధాంత జ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను సంపాదించడం చాలా అవసరమని. ఈ లక్ష్యంతో, భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాల (బిట్స్)లో డిజిటల్ సిస్టమ్ డిజైన్ విత్ సిమ్యులేషన్ టూల్స్‌పై ఒక మూడు రోజుల హ్యాండ్స్ ఆన్ వర్క్షాప్ 2025, జూలై 16, 17, 18 తేదీల్లో నిర్వహించడము జరిగినది. ఈ శిక్షణా కార్యక్రమంలో కళాశాల యొక్క రెండవ సంవత్సరం బి.టెక్ విద్యార్థులందరూ భాగస్వాములయ్యారు. మాట్లాడుతూ విద్యార్థు లు ఇలాంటి వర్క్షాప్‌లలో చురుకుగా పాల్గొని సాంకేతిక ప్రావీణ్యం పెంపొందించు కోవాలన్నారు. ఈ డిజిటల్ యుగంలో మంచి అభివృద్ధి సాధించాలంటే, ప్రాథమిక సూత్రాలపై మంచి పట్టు ఉండటం చాలా అవసరం అనీ ముఖ్యమైన సందేశాన్ని ప్రిన్సిపల్ అందించారు.

## మండలంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం

కలికిరి జూలై 19 ప్రభాతవార్త :

మండలంలోని 14 గ్రామపంచాయతీలో శనివారం ఎంపీడీవో మహమ్మద్ రియాజుద్దీన్ పర్యవేక్షణలో స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతం చేశారు. మండలంలోని మేజర్ పంచాయతీలో సర్పంచ్ ఎల్లయ్య ఈవో అశోక్ కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు యోగేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం పై ర్యాలీ నిర్వహించారు. అలాగే మర్రికుంటపల్లి పంచాయతీలో సర్పంచ్ రెడ్డిగాం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు..

## ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం



బద్వేలు జూలై 19 ప్రభాతవార్త

ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం పరిసరాలను కాపాడుకుందామని శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యానికి స్వస్తి పలకాలనీ చెప్పారు. అవసరమైన రీసైక్లింగ్, ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే తప్పని పరిస్థితులలో పరిమితంగా వాడాలి. పూర్తిగా పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి సి.హెచ్. ఈశ్వరయ్య, సభ్యులు డా.యం.దొరస్వామి నాయక్, డి.మేరీ స్వర్ణలత,ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్, జూలై 19 ,ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోని సుమిత్ర నగర్ ,పద్మావతి ఆసుపత్రి లైన్ మొదలగు ఏరియాల లో శనివారం మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి పర్యటించారు. ఈ మేరకు సందు రస్తాలను ఆక్రమించి డ్రైనేజీ కాలువలు పైన స్టెప్స్, మరుగుదొడ్లు వంటి కట్టడాలు కట్టి మురుగు నీరు పారుదలకు, తీసిన సిల్ట్ బయటకు తీసుకొని పోవడానికి తీవ్ర ఆటంకం జరుగుతుందన్నారు. అలాగే బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో సందు రస్థాలు, దొడ్డి రస్తాలు ఆక్రమించిన వారికి నోటీస్ లు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందినీ ఆదేశించారు. రోడ్డు కు వదలవలసిన స్థలం కంటే వదలకుండా స్టెప్స్ రోడ్డు మీదకు కట్టి ప్రజలకు ఇబ్బంది కలగజేస్తున్నారు.అటువంటి స్వచ్ఛందంగా తొలగించవలెనని సూచించారు .టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఫీల్డ్ లో తిరుగుతూ ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నిర్దోషులను వెంటనే విడుదల చెయ్యాలి..

కడప కార్పొరేషన్, జూలై 19 ప్రభాతవార్త:



అమాయకులైన ముస్లింలను విడుదల చేయాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. పోలీసులు నిర్బంధించిన వారిలో రోజువారి కూలీలు ఉన్నారని, వారి భవిష్యత్తు రీత్య కనికరం చూపాలన్నారు. శనివారం కడప పోలీసు కార్యాలయం లోని ఎస్పీ ఛాంబర్ లో జిల్లా ఎస్పీ ఇ జి అశోక్ కుమార్ ను ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ కలిసి వినతి పత్రం సమర్పించారు. వేంపల్లె పోలీస్ స్టేషన్ పై దాడి విషయంలో చాలామంది అమాయక ముస్లింలు ఉన్నారని వారిని విడుదల చేయాలని కోరారు. ప్రజల రక్షణ కై ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ పై దాడి చేయడం నేరమని, ఇది పోలీసు వ్యవస్థ పై ప్రజలకు అపనమ్మకం కలిగించే చర్య అని జిల్లా ఎస్పీ ఇ. జి అశోక్ కుమార్ అన్నారు. దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు. విచారణలో నిర్దోషులుగా తేలిన వారిని తప్పకుండా విడుదల చేస్తామని ఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారీ, సర్దార్, సయ్యద్ తాహిర్ బుఖారీ పాల్గొన్నారు.

## 20 మద్యం బాటిల్లు స్వాధీనం

దువ్వూరు, జూలై 19, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తిని శనివారం అదుపు లోకి తీసుకొని 20 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు సిబ్బందిచే కలిసి దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో అతని వద్ద ఉన్న 20 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ సుమారు 2500 ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

## వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

బద్వేల్ అర్బన్, జూలై 19, ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్డు లో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం వీరేశచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం కుంకుమ అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది.ప్రత్యేక అభిషేక దాతలుగా చంద్ర మోహన్ సతీమణి సుభాషిణి , పబ్బుతి చంద్ర శేఖర్ సతీమణి వసంత లక్ష్మి లక్ష్మీ నారాయణ రెడ్డి సతీమణి స్వర్ణ లత శ్రీనివాసులు సతీమణి రాజేశ్వరి , అలాగే చాగ నాగేంద్ర నాథ రెడ్డి సతీమణి ఉమా మహేశ్వరి పబ్బుతి సత్య నారాయణ సతీమణి శ్రీ దేవి , పెద్ది వెంకట సుధాకర్ సతీమణి వసంత లక్ష్మి కుటుంబ సభ్యులు పూజలు చేశారు. అలాగే ప్రత్యేక ఉభయ దాతలుగా ఆది నారాయణ సతీమణి సౌజన్య , కొణతాల పల్లి శ్రీనివాసులు సతీమణి వెంకట లక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ నిర్వాహకులు వెంకట రమణ, మేనేజర్ రమణలు తీర్థ ప్రసాదాలు అందించారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు

చిట్వేలి, జూలై 19,ప్రభాతవార్త:

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానుల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై నవీన్ బాబు అన్నారు. శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ మైనర్లకు వాహనాల ఇవ్వడం నేరమని, అవగాహన లోపంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అట్టి వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరుస్తామని తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు సంబంధిత వాహన రికార్డులను కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడప రాదని హెచ్చరించారు. పెండింగ్ లో ఉన్న వాహన అపరాధ రుసుములు వెంటనే చెల్లించాలన్నారు. అట్లు చెల్లించక తిరిగి పట్టుబడినట్లైతే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయం కాకుండా ఆటోలు, ఇతర వాహనాలు దూరంగా నిలపాలన్నారు. ట్రాఫిక్ సమస్య నిరోధించడానికి దుకాణదారులు సహకరించాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి దుకాణం ముందర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని పాటిస్తామని ఏ సమస్య ఉన్న ప్రజలు తమను కలవచ్చని ఎస్సై నవీన్ బాబు సూచించారు. కార్యక్రమంలో సహా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు



కలికిరి, జులై 19, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో శనివారం పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్‌ఛార్జి వాసనూరి చంద్రశేఖర్ పర్యవేక్షణలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలోని పాత హరిజనవాడ, బోడిరెడ్డిగారిపల్లె, మల్‌రెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తెదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. పీలేరు నియోజకవర్గంలో ఇప్పటికే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేసి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సత్య సాయిబాబా రదయాత్ర

బద్వేల్ అర్బన్ జూలై 19 ప్రభాతవార్త :



బద్వేల్ పట్టణంలో శనివారం శ్రీ సత్యసాయి బాబా 100,వ జయంతి సందర్భంగా బద్వేల్ కన్వీనర్ చుండూరు వెంకటరమణ పోరుమామిళ్ల కన్వీనర్ సుధాకర్‌ల ఆధ్వర్యంలో వైభవంగా సత్య సాయి బాబా రథ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు, వైభవంగా రథోత్సవం నిర్వహిస్తూ రథోత్సవం వెంబటి పలువురు వివిధ రకాల వేషధారణలతో కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకునే విధంగా నిలిచాయి, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంగం అధ్యక్షులు కే, వి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బుతి చంద్రశేఖర్, పత్తి రాజా గారి కృష్ణమూర్తి, సురేష్, చిందుకూరి సుధాకర్, పబ్బుతి హజరత్ సూర్య యూత్ టైల్స్ వల్లంకొండు సూర్యనారాయణ, దర్శి వెంకటేశ్వర్లు, మరియు పలువురు కాంప్లెక్స్ వ్యాపారస్తులతో పాటు పలువురు పాల్గొన్నారు

## స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర ర్యాలీ

దువ్వూరు, జూలై 19, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోను అలాగే అన్ని గ్రామ సచివాలయాల పరిధి లోనూ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర పై అవగాహన కల్పించేందుకు సచివాలయ సిబ్బందిచే ర్యాలీలు నిర్వహించినట్లు ఈఓపీఆర్డి హరికృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన దువ్వూరులో సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు కలిసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుండి 3 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో సర్పంచ్ చంద్రాయుడు, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదు

దువ్వూరు, జూలై 19, ప్రభాతవార్త:



మండలంలో ఉన్న అన్ని దుకానాదారులు ఇక నుంచి ప్లాస్టిక్ కు సంబంధించిన ఎటువంటి వస్తువులు అమ్మరాదనీ, అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వినోద్ కుమార్ అన్నారు. శనివారం ఎస్ఐ, సిబ్బంది కలిసి దువ్వురులో ప్రతి దుకానాదారుని వద్దకు వెళ్లి కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను చూపిస్తూ వీటిని 15రోజుల లోపల విక్రయించు కోవాలని, అనంతరం దుకాణలో ప్లాస్టిక్ కవర్లు ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతానికి అవగాహన కల్పిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకొని ఇకముందు విక్రయించ రాదని అన్నారు.

## నేడు మూర్చవ్యాధిపై మెడికల్ క్యాంపు

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో 20న ఆదివారం మూర్చవ్యాధిపై మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు స్కూల్ కన్వీనర్ ఉదయ్ మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ జిబిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలన్, శివనారాయణ ఎండి, డిఎం స్ఫూర్తితో స్వచ్ఛందసంస్థల సహకారంతో ఈ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రెండు నెలలకు ఒక్కసారి మూడవ ఆదివారం ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్యక్యాంపులో మొదటి నెల మందులు ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. మూర్చవ్యాధితో భాదపడుతున్నవారు ఈ క్యాంపు హాజరై ఎలాంటి ఫీజు చెల్లించకుండా ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. ఉదయం 9గంటల నుంచి మద్యాహ్నం 1గంట వరకు క్యాపు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నాగేంద్రారెడ్డి

**ప్రొద్దుటూరు జూలై 19 ప్రభాతవార్త**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన నెల్లూరు నాగేంద్రారెడ్డిని వైసిపి రాష్ట్ర శాఖ నియమించింది. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శిగా (కడప పార్లమెంట్ కోఆర్డినేషన్) వైయస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కల్లూరు నాగేంద్రారెడ్డిని నియమించడం తప్ప వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కల్లూరు నాగేంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవి కట్ట పెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డికి ఆత్మీయ కుటుంబ శ్రేయోభిలాషి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి కోసం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలకండి



**బద్వేల్, జూలై 19 ప్రభాతవార్త**

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారిపల్లె ఆస్పత్రిలో ఆవరణ నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర జరగడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వలన భూమి, నీరు, సముద్రము మరియు వాయు కాలుష్యాలకు గురి అవుతున్నాయని తెలిపారు. నీటిలోని జలచరాలు ప్లాస్టిక్ వ్యర్థాలు మింగడం వలన మరణానికి గురి అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వలన హానికరమైన వాయువులు విడుదల అవుతున్నాయని, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆహారంలో కలిసిపోవడం వలన విషపూరితమైన రసాయనాలు వెలువడి మనుషులకు చేరి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి మరియు పర్యావరణ వ్యవస్థ దెబ్బ తింటుంది. జీవవైవిధ్యము తగ్గుతుంది. ప్లాస్టిక్‌ని సృష్టించడం, రీసైక్లింగ్ చేయడము రెండు విషపూరిత వాయువులు అని పేర్కొనడమైనది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిసరాలు అంతయు శుభ్రపరచడం జరిగినది, తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్లాస్టిక్ వాడటం వలన కలిగే దుష్పరిమానాల గురించి ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని, ప్లాస్టిక్ వాడటం మానివేస్తామని, స్వచ్ఛ ఆంధ్రఆరోగ్య ఆంధ్ర దిశగా ముందడుగు వేస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ఈ కార్యక్రమములో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య హెల్త్ సూపర్వైజర్ కె వెంకటమ్మ ఏఎన్ఎంలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## మురికి కాల్వను పరిశీలించిన వైద్యాధికారి

**సుండుపల్లి, జూలై 19, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య డాక్టర్. శేఖర్ రెడ్డి మడితాడు గ్రామ పంచాయతీ లోని మడితాడు నందు బస్టాండ్ దగ్గర మురికి కాలువ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మురికి కాలువ నందు గత కొన్ని సంవత్సరముల నుండి ఇండ్లలో నుండి మురికి నీరు కాలువలోనికి వచ్చి మురికి నీరు పోవుటకు కాలువలో సరైన దారి లేక మురికి కాలువలోని నీరు ఉండడం జరుగుతూ ఉన్నదని గ్రామస్తులు ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నీళ్లు సరిగా పారక పోవడం వలన నీరు నిలువ ఉన్నది. తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నది, కావున కాల్వసుబ్రపరచవలెనని తెలియజేసారు. అనంతరం రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు స్వచ్ఛభారత్ స్వచ్ఛఆంధ్ర నిర్వహించి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్లాస్టిక్ వాడడం ద్వారా మనుషులకు అనేక వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలియజేసి, ప్లాస్టిక్ మేము ఎన్నడూ ఆడబోమని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం నందు ఎంపీహెచ్ఇఒ వీర నారాయణ, ఏఎన్ఎం శశికళ, సి.హెచ్.ఓ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామివారికి 16,116లు విరాళం

**సుండుపల్లె, జూలై 19, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఆరోగ్యపురం ఎంజిఆర్ కాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు 19వ తేదీ ఆషాడ మాస శనివారం సందర్భంగా స్వామివారికి అభిషేకం పూల అలంకరణ నైవేద్యం సమర్పించడం జరిగింది, పెద్ద బిడికిలో నివాసం ఉన్న శారదా బాబు నాయక్ కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి గాను 16116/ రూపాయలు చందాగా ఇచ్చారు. మరియు పింఛలో నివాసమున్న పార్వతి వేణుగోపాల్ స్వామి వారికి 101 టెంకాయలు కొట్టి ముక్కులు చేర్చుకున్నారు వచ్చిన భక్తులకి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగినది

## యూనివర్సిటీ డాక్టరేట్ వేడుకలకు ఆహ్వానం

**ఒంటిమిట్ట జూలై 19( ప్రభాతవార్త)**



పాండిచ్చేరి అతిథి గృహంలో అమెరికన్ వీస్ డం పీస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన వివిధ రంగాలలో ప్రతిభ కలిగిన వారికి డాక్టరేట్ పురస్కారాలు అందించు కార్యక్రమానికి ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు పసుపులేటి శివశంకర్కు ముఖ్య అతిథి ఆహ్వానం లభించింది. విభిన్న రంగాలలో ప్రతిభ కలిగిన వ్యక్తులకు డాక్టరేట్ పురస్కారాలు అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాండిచ్చేరి లోక్ సభ స్పీకర్ ,ఎమ్మెల్యే యంబలం సెల్వం, ఐదు సార్లు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించిన కరాటే శ్రీనాథ్, కోయంబత్తూర్‌కు చెందిన ఆల్ ఇండియా ఆంటీ విండోడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కతెర్వెల్, పాండిచ్చేరి కేంద్ర కారాగార సూపరెంటెంట్ భాస్కరన్, పాండిచ్చేరి నమ్మాల్వార్, న్యాచురల్ ఫార్మర్స్ అసోసియేషన్ కో ప్రెసిడెంట్ రాజా వేణుగోపాల్, పాండిచ్చేరి టాగూర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన రేఖ ,రాజా, దేవి ప్రియా, నారాయణస్వామి ,విమల, విఘ్నేశ్వర, షణ్ముఖప్రియా, పాల్గొంటారని ఆహ్వాన పత్రంలో విశ్వవిద్యాలయం పేర్కొంది.

## ప్లాస్టిక్ భూతం నుంచి నేటి తరాన్ని రక్షిద్దాం



**ముద్దనూరు. జూలై 19. ప్రభాతవార్త:**

ప్లాస్టిక్ భూతం నుంచి నేటి తరాన్ని రక్షిద్దాం అని, ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ కాలుష్యానికి ముగింపు పేరుతో శనివారం నాడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టి, పాత బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని మండల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధాకృష్ణ వేణి మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేసి 120 మైక్రాన్ కన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని దుకాణదారులు గమనించి వాటినీ అమ్మ వద్దని, కొనవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం అపర్ణ, ఏపీవో గంగయ్య ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు, సచివాల సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలో స్మార్ట్ కిచెన్ల పరిశీలన.

**తొండూరు జూలై 19 ప్రభాతవార్త:**



తొండూరు మండలం లోని అగుడూరు హై స్కూల్ నందు సమగ్ర మధ్యాహ్నం భోజన ము పథకం సంబంధించి స్మార్ట్ కిచెన్ ఏర్పాట్లు భాగంగా స్థల పరిశీలనకు వచ్చిన నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.రాజలక్ష్మి, ఎంపీడీవో విష్ణు ప్రసాద్ మరియు స్కూల్ హెడ్మాస్టర్ మరియు APM లు మరియు సీసీలు గ్రామ ప్రజలు హాజరు కావడం జరిగింది. అదేవిధంగా మహిళా సంఘ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది మహిళా సంఘ సభ్యులు గ్రామ సంఘంఅనిమేటర్లుపాల్గొన్నారు. అదేవిధంగా ఇనుగులూరు నందు పాల కేంద్రాన్ని సదర్శించి పాలు తూకం రేట్లు పరిశీలన చేయడం జరిగింది.

## కనీస సౌకర్యాలు లేని బడ్జెట్ పాఠశాలల గుర్తింపుని రద్దు చెయ్యాలి

**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 19 ప్రభాతవార్త :**

కడప జిల్లాలో సుమారు వెయ్యికిపైగా బడ్జెట్ పాఠశాలలు చట్టాలు అమలు చెయ్యలేదని అలాంటి కనీస సౌకర్యాలు లేని బడ్జెట్ పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ప్రైవేట్ టీచర్స్ లెస్చిల్లర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు లేరని, బాల, బాలికలకు సరిపడే టాయిలెట్స్ లేవని, నీటి సరఫరా లేదని, ప్రభుత్వం నిర్దేశించిన పాఠశాలల సమయపాలన పాటించడం లేదని, అందులో పనిచేసే ప్రైవేట్ టీచర్స్‌కి సరియైన జీతం ఉండదని, భవిష్య నిధి, ఈఎస్ఐ, గ్రేట్యూటీ లాంటివి ఉండవని, నోటిమాటతో ఉద్యోగం నుండి తొలగించడం, జీవో ఎంఎస్ నెంబర్ 1ని పాటించని బడ్జెట్ పాఠశాలల పై జిల్లా విద్యాశాఖధికారి చర్యలు తీసుకోవాలని, ప్రొద్దుటూరు జిల్లా ఉపవిద్యాధికారిని కలిసి వినతి ఆయన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పిటిఎల్యు రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు, ప్రైవేట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఇరువర్గాలు ఘర్షణ, ఇద్దరికీ తీవ్ర గాయాలు.

### దాడి చేసిన వారిని కఠినంగా శిక్షిస్తాం

**తొండూరు జూలై 19 ప్రభాతవార్త:**



మండలంలోని ఇనగలూరు గ్రామం నందు పాత కక్షలు మళ్ళీ బగ్గుమన్నాయి. ఇనగలూరు గ్రామానికి చెందిన హరి కిషోర్ రెడ్డి సమర సింహారెడ్డి ఇద్దరు అన్నదమ్ములు బైక్‌పై పులివెందులకు వెళుతుండగా సైదాపురం గ్రామ సమీపాన ఇనగలూరు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు వాహనంతో ఢీ కొట్టి వారుకింద పడగానే కర్రలు, రాడ్లతో దాడి చేసి తలపై కొట్టడం జరిగింది దీంతో తీవ్ర రక్త స్రావమై పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి వెళ్లిన రూరల్ సీఐ వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని వారి వివరాలు తెలుసుకొని వారిపై కేసు నమోదు చేస్తామని బాధితులతో మాట్లాడి కంప్లైంట్ తీసుకొని దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు వివరించారు.

## ఉమ్మడిగా రాయలసీమకు అన్యాయం

**తొండూరు జూలై 19 ప్రభాతవార్త :**




పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా జూలై 22 నుండి 24 వరకు బద్వేల్లో జిల్లా మహాసభలు, ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్ 21 నుండి 24 వరకు చండీగర్ లో జాతీయ మహాసభలు జరగబోతున్నాయని శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన నల్లధనం వెలికితీత, పన్నుల తగ్గింపు, జన్ ధన్ యోజన ద్వారా మహిళల అకౌంట్లో లక్షల జమ, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాల కల్పన వంటి వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యింది. మీడియాను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ ప్రశ్నించే పార్టీల, రాష్ట్రాలపై అక్రమ కేసులు పెట్టి ఫెడరల్ స్ఫూర్తిని మంటగలుపుతోంది. జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే ఖనిజనిక్షేపాల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే వంద సంవత్సరాలకు సరిపడు ముడిసరుకు అందుబాలులో ఉన్నదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చందా, జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరములు సిపిఐ నాయకులు ఈశ్వరయ్య, అమీర పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

**రామసముద్రం జులై 19 ప్రభాతవార్త**

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ప్రతి నెల శనివారం రోజున నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు మేరకు శనివారం మండల కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, ఇంచార్జి ఎంపిడిఓ ఎస్. ఏ గఫూర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు పారిశుద్ధ కార్మికులు జడ్పీ హైస్కూల్ నుండి ప్రధాన ఉపాధ్యాయులు చిట్టి బాబు ఉపాధ్యాయులు పాఠశాల నుండి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సర్కిల్ మానవహారం చేసి ప్రతిదుకాణం కి వెళ్లి ప్లాస్టిక్ నిర్మూలన పై దుకాణ యజమానులకు అవగాహన కల్పించి పారిశుద్ధ పనులు పరిశీలించారు. మండలంలో సచివాలయాలు, పాఠశాలల్లో శుభ్రం చేయడం జరిగింది. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం లో భాగంగా పోలీస్ కార్యాలయం ఆవరణలో శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, ఇంచార్జ్ ఎంపిడిఓ గఫూర్, ఎం ఈఓ 2 ఆంజనేయులు పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్, హెచ్ ఎం చిట్టిబాబు ఎస్సై రమేష్ బాబు, ఏ ఎస్సై హిమాచలపతి, లోకేష్, బాలాజీ, సురేంద్ర యాదవ్, భరత్ రెడ్డి, లత, జ్యోతి, సి.ఆర్.పి లత సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



## హామీలు నెరవేర్చని బాబు సర్కార్..



**కడప కార్పొరేషన్, జులై 19 ప్రభాతవార్త:**

ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కడప వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, కడప నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్ర బాబు నాయుడు మానిఫెస్టో (రీ కాల్ మానిఫెస్టో) గుర్తు చేస్తూ కడప నగరంలోని ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కడప ఐఎంఏ హాల్లో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఇస్తా అన్న రూ.20 వేలు, ఆడబిడ్డలకు నెలకు రూ.1500, ఆడబిడ్డలకు ఉచిత బస్, ఇంటి ఇంటికి ఒక ఉద్యోగం, నిరుద్యోగులకు నెల రూ.3000లు 50 సంవత్సరాలు దాటిన యస్.సి, యస్.టి,బి.సి మైనారిటీ లకు ఇస్తా అన్న పెన్షన్ వంటి పదకాల అమలు చేయలేదని విమర్శించారు. వైసిపి ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం 15 లక్షల మంది 50 సంవత్సరాలు దాటిన వారు ఉన్నారు అని వీరి అందరికీ పెన్షన్ ఇవ్వకుండా మోసం చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మెట బసవరాజు, తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, యానాదయ్య, బి హెచ్.ఇలియాస్, జయ చంద్రారెడ్డి, ప్రసాద్ రెడ్డి, భాస్కర్ వర్మ, ఆర్ వి.రమణ, నాగేంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సిందే రవిచంద్ర, మదన్మోహన్ రెడ్డి, గుంటి నాగేంద్ర, ఎ ఎం.కిరణ్ , పాక సురేష్, ఆదిత్య, దాసరి శివ, బాలకొండయ్య, పవర్ అల్తాఫ్, గౌస్ బాషా (చాక్లెట్), కేసర్ కన్స్ ట్రక్షన్ సుధాకర్ రెడ్డి, ఈటె రామచంద్రయ్య, రామలక్ష్మణ రెడ్డి, పస్తం అంజి, సాయి దత్త, బండి ప్రసాద్, త్యాగరాజు, అలీ అక్బర్, షంషేర్, షఫీ, వినో, బాబు, బాలస్వామి రెడ్డి, రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

## మునయ్య కోనలో దొంగతనం యత్నం



**ముద్దనూరు. జూలై 19. ప్రభాతవార్త:**

అతి పురాతనమైన, ఎంతో ప్రసిద్ధి కలిగిన దైవ క్షేత్రం మునయ్యకోనలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ గేటును పగలగొట్టి బీరువాలో ఉన్న స్వామి వారి బట్టలను, పూజ సామాగ్రిని చెల్లాచెదురుగా వేసి దొంగతనానికి ప్రయత్నించినట్లు శనివారం నాడు స్థానికులు తెలిపారు. జమ్మలమడుగు ముద్దనూరు ప్రధాన రహదారిలో ఉన్న ఏసుక్రీస్తు సిలువను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కొంతమేర ధ్వంసం చేసినట్లు స్థానికులు వివరించారు. ఇలా వరుస ఘటనలు ఆకతాయిల పనేనా లేక గుప్తనిధుల వేటగాళ్ల పనే నా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచి పునరావతం కాకుండా ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పాడి రైతులకు సేవ చేయడమే లక్ష్యం

### డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌నాయుడు

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**



పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సేవ చేయడమే లక్ష్యమని డివిజనల్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన మదనపల్లె పశుసంవర్థకశాఖ ఇన్‌చార్జ్ డివిజనల్ డిప్యూటి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్థకశాఖ ద్వారా అందించే అన్ని పథకాలు, సేవలు పాడిరైతులకు అందేలా చర్యలు తీసుకోవడనం జరుగుతుందన్నారు. ఏడాదికి రెండు సార్లు పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముద్ద చర్మవాటికి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. జాతీయ లైవ్ స్టాక్‌మిషన్ పథకం ద్వారా రైతులు రాయితీ లభించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో 75శాతం సబ్సిడితో పశుగ్రాస విత్తనాలు, 50శాతంతో పశువుల దాణా ఇవ్వడం జరుగుతుందన్నారు. లింగ నిర్ధారణ, వీర్యాన్ని ఉపయోగించి పేయ దూడలు మాత్రమే పుట్టే విధంగా ఉన్న అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని పశువుల ఆసుపత్రుల్లో రైతులకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

### నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్



సన్మానిస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంచేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయాలన్నారు. 2029లో రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిగా చేసి దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. దేశ ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందన్నారు. ఏపిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, మహమ్మద్‌షరీప్, ఖాదర్‌బాషా, ముభారక్‌ఖాన్, మహమ్మద్‌రఫి, ఈశ్వరమ్మ, శరత్‌కుమార్‌రెడ్డి, వసంతకుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెవితిమ్మరాయ స్వామి వారికి ప్రత్యేకపూజలు

**రామసముద్రం జులై 19 ప్రభాతవార్త**



మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని కొండపై వెలిసిన గవితిమ్మరాయ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బట్టర్ స్వామివారికి ఉదయం ఆలయ శుద్ధిచేసి పలు రకాల పుష్పములతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు గోవిందా గోవిందా అంటూ నామస్మరణలతో మారి మ్రోగిన గెవితిమ్మరాయస్వామి ఆలయం. అలాగే మండల కేంద్రంలోని చెంబకూరు రోడ్డులో ఉన్న శనేశ్వరస్వామి ఆలయం లో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించిన పూజారి నాగార్జున భక్తులకు స్వామివారిని దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## విద్యుత్ స్మార్ట్ వెంటనే మీటర్లు తొలగించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**

విద్యుత్ వినియోగదారులకు డిష్కంలు భిగిస్తున్న స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో స్మార్ట్ మీటర్లు తొలగించాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ వినియోగదారునిపై మోపిన ట్రూ ఆఫ్ ఎఫ్‌పిపిటిసిఎ ఛారాలను రద్దు చేయాలన్నారు. గతంలో జగన్ ప్రభుత్వ విధానాలనే చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తొందన్నారు. వీరిద్దరి ప్రభుత్వాలకు తేడా లేదని ప్రధాని నరేంద్రమోడీ చేతిలో ఇద్దరూ కీలుబొమ్మల్లా ఉండారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు భిగించలేదన్నారు. ప్రభుత్వ ఆద్వర్యంలో ఉన్న జంకో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేటు నుంచి అధిక ధరలతో కొనుగోలు చేస్తూ ప్రజల నెత్తిన భారాలు మోపుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు తొలగించకపోతే విద్యుత్ పోరాటం తప్పదన్నారు. రాష్ట్రం ఆదాని హాబ్‌గా మారిపోతుందని విమర్శించారు. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు ప్రజల నెత్తిన భారాలు మోపుతున్నాయన్నారు. సెకి ఒప్పందానికి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణతో పాటు మంత్రి పయ్యావుల కేశవ్ కోర్టులో కేసు వేశారని గుర్తు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మురళి, మాధవ్, సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి చిన్నిక్రిష్ణ, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**సిద్ధవటం జులై 19 ప్రభాతవార్త :**

స్వర్ణాంధ్ర,, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మన అందరి బాధ్యతని ఎంపీడీవో ఫణి రాజకుమారి పేర్కొన్నారు మండల కేంద్రమైన సిద్ధవటం జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో ఫణి రాజకుమారి శనివారం మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై, అవగాహన కల్పించి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించామని ప్రతి ఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవడంలో ఒక అడుగు ముందుకు వేయాలని ఈ మహత్తర లక్ష్యం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా మనందరి బాధ్యత స్వచ్ఛ ఆంధ్ర, ప్రగతికి తొలిమెట్టుగా అందరంకలిసి ప్లాస్టిక్ నివారించి పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలని ఆమె అన్నారు ఆంధ్రప్రదేశ్ ను, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ శ్రీహరి మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శి దాసరి రత్నకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి ఇద్దరు అరెస్టు

**కురబలకోట, జులై 19 ప్రభాతవార్త :**

కురబలకోట మండలంలో శనివారం పేకాట స్థావరంపై ముదివేడు పోలీసులు దాడిచేసి ఇద్దరు పేకాట రాయుళ్ళను పట్టుకొన్నారు. ఈ స్థావరం నుంచి విషయం తెలుసుకొని పేకాటరాయుళ్ళు ఆరుగురు పరారైనట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు ముదివేడు స్టేషన్ పరిధిలోని గోపాలపురం వెనుకవైపున చెట్ల మాటున పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడిచేసి అందులోని ఇద్దరు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.5050లు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ఇందులో ఆరుగురు పరారీలో ఉన్నారని వెంటనే వారిని పట్టుకొని కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

## చెత్తరహిత గ్రామాలుగా తీర్చుదాం



స్వచ్ఛాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కురబలకోట, జులై 19 ప్రభాతవార్త :**

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కురబలకోట ఎంపిడిఓ గంగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన కురబలకోటలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ సెక్రటరీలు ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కురబలకోట బస్టాండులో ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ రహితంగా ఉండేందుకు హోటళ్లు, కిరాణ షాపు యజమానులు ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగాన్ని నిర్మూలించేందు కృషి చేయాలన్నారు. దీనిపై ప్రజలకు బస్టాండులో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీలు శేషగిరికుమార్, గురుమోహన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది నిర్వహించారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

**ప్రొద్దుటూరు, జులై 12 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డు అన్వర్ ఆలు ఎదురుగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 1000 మందికి పైగా ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఆకలి తీర్చడమే ధ్యేయంగా పెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని భోజనాన్ని ఆరగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, రిటైర్డ్ ఎఇ రామసుబ్బన్న యాదవ్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు, టైలర్ ప్రసాద్, మూరబోయిన శ్రీనివాసులు యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, బంగి శివప్రసాద్, కర్ణ యాదవ్, రామయ్య గౌడ్, నల్లం రవిశంకర్ పాల్గొన్నారు.



# ఆదరణకు నోచుకోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

### ప్రధాన అర్చకులకు అందని వేతనాలు... శిథిలా వ్యవస్థకు చేరుకుంటున్న శివాలయం



**పీలేరు జూలై 19 ప్రభాతవార్త:**
పీలేరు నియోజకవర్గ కలికిరి పట్టణంలోని నడిబొడ్డున ప్రధాన రహదారిలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదరణకు నోచుకోక ప్రధాన అర్చకులకు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఈ ఆలయం శిథిలా వ్యవస్థకు చేరుకున్నది.

**ఆలయ ప్రస్థానం ఇలా ...**
కలికిరి పట్టణం ప్రధాన నగరంలోని వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి 400 సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నది. గుడి మీద లభించిన శాసనాలు ఆధారంగా 4వందల ఏళ్ల చరిత్ర ఉందని పురావస్తు శాఖ దీన్ని గుర్తించింది. అప్పటినుంచి ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ ఆధీనంలోకి చేర్చబడింది. 1963 సంవత్సరంలో దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు. తొలుత ఈ ఆలయానికి వెంకటా చార్యులు ప్రధాన అర్చకులుగా నాడు పని చేశారు. ఆయన అనంతరం శ్రీ లక్ష్మీకాంతచార్యులు ప్రధాన అర్చకులుగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ధర్మకర్త నల్లారి గంగిరెడ్డి వ్యవహరించారు. ఆలయ ఆవరణంలో 20 అంకణాల స్థలంలో ఒక గదిని ఏర్పాటు చేసి ఇతరులకు అద్దెకు ఇస్తుండేవారు తద్వారా వచ్చిన ఆదాయాన్ని అర్చకులకు వేతనముగా ఇస్తుండేవారు. అనంతరం ఇదే గదిని 1975 నుంచి 60 రూపాయలకు అద్దెకు ఇచ్చారు. 1996 నుంచి రూ 300 కు పెంచి ఈ వచ్చే ఆదాయంతో ప్రధాన అర్చకుల నిర్వహణకు ఖర్చు చేస్తూ వచ్చేవారు. ప్రతి సంవత్సరం జేష్ఠ మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలకు చందాలు వసూలు చేస్తూ ఉండేవారు. ఈ క్రమంలో 2008వ సంవత్సరంలో ప్రధాన అర్చకులు లక్ష్మీకాంతా చార్యులు అనంతరం ఆయన కుమారుడైన శ్రీధరాచార్యులు కొనసాగుతూ వచ్చారు. 2010లో శ్రీధరాచార్యులు మృతి చెందారు. అప్పటినుంచి మురళీ చార్యులు ప్రధాన అర్చకులుగా కొనసాగారు. అప్పటినుంచి స్వీపర్లకు 1500వందల రూపాయలు, ప్రధాన అర్చకులకు 1000 రూపాయలు వేతనం ధూప దీప నైవేద్యం కింద ఆ అందించే వారని అన్నారు. ఇలా వస్తున్న ఆలయం ఆదరణకు నోచుకోక అభివృద్ధి చెందక శిథిలా వ్యవస్థకు చేరుకుంది. ఆలయానికి ఇటీవల రెండు లక్షల 40 వేలు వ్యయంతో ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం జరిగింది. 60 వేలతో మండపం ఏర్పాటు చేయడం జరిగిందని దానికి ప్రహరీ గోడకు మరో 60.వేల తో నిర్మించారు. ఆలయానికి ప్రహరీ గోడ గర్భ గుడి పైన గోపురం మూలవిరాట్ పై వర్షపు నీరు పడుతున్నది. గర్భ గుడి వర్షానికి తడుస్తున్నది. వాహన మండపం వాహనాల గుడికి ప్రహరీ గోడ గర్భగుడిపై గోపురం ఆస్థాన మండపం శిథిలాలకు చేరుకున్నాయి. వీటన్నిటిని పరిగణంలోకి తీసుకుని దేవాదాయ శాఖ తగు చర్యలు తీసుకోవాలని ప్రధాన అర్చకులు మురళీధర్ కోరుచున్నారు.



**ఆలయ అభివృద్ధే ధ్యేయం: రెడ్డి సంఘం కమిటీ**





ఎంతో పవిత్రంగా పూజించే శివాలయం శిథిలా వస్తకు చేరుకోవడంతో భక్తులు మనోభావాలు దెబ్బతింటున్నాయ ని జిల్లా రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి ,కార్యదర్శి లాయర్ రాంప్రసాద్ రెడ్డి తో పాటు రాజారెడ్డి, ప్రతాపరెడ్డి పాపి రెడ్డి, జనార్ధన్ రెడ్డి ఆదినారాయణ రెడ్డి , యర్రం రెడ్డి భక్తుడు రాజేష్ ,పురుషోత్తం రెడ్డి పలువురు సంఘ సేవ సంస్కర్తలతో పాటు మరికొందరు నాయకులు కూడా గర్భ గుడి నీరు కారుతుండటం బాధాకరమని అదే విధంగా గర్భగుడితోపాటు పురాతన మైన ఆలయాన్ని పునరుద్దించాలని నిర్ణయం తీసుకున్నామని దానికి స్థానిక శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చేయూత అందించాలని పలువు రు కోరుతున్నారు పట్టణంలో సుమారు 60ఎకరాలకు పైగా నరసింహ స్వామి ఆలయ ఆస్తులు ఉన్న గర్భగుడిలో దీపం పెట్టేందుకు కూడా నిధులు లేకపోవడంతో పలువురు రెడ్డి సంఘం సభ్యులు చందాల రూపంలో ఇస్తూ మరికొందరు దాతలు ఆలయ బాగోగులకు చేయూతనందించడం చూస్తే సమాజంలో దేవునిపై కొంతమంది రాజకీయ నాయకుల నిర్లక్ష్యం తెలుస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఏది ఏమైనప్పటికీ సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయం పవిత్రతను కాపాడి ఆలయ అభివృద్ధికి అందరూ తమ వంతు కృషి చేయాలని కోరుతున్నారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**కడప జూలై 19 ప్రభాతవార్త :**
కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కాలేజీలో 1996, 2000 సంవత్సరంలో ఇంజనీరింగ్ పట్టభద్రులై దాదాపు 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు శనివారం అపూర్వ కలయికగా కలవడం జరిగింది. నగర శివారులోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పురస్కరించుకొని కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. వివిధ దేశాలలో ఎక్కడెక్కడో ఉద్యోగాలలో స్థిరపడి ఈ సమావేశానికి వచ్చి ఎన్నో మధురానుభూతులకు వేదికగా నిలిచిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ అత్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎంతో సందడిగా ఈ అపూర్వ కలయిక జరిగింది.. ఈ సందర్భంగా బోలెడన్ని దావోద్వేగా దృశ్యాలు కనిపించడంతోపాటు ఎంతో మధురానుభూతులకు వేదికగా మారింది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల నిమిత్తం వారు వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడి ఈ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది. తమకు విద్యాబోధన చేసిన గురువులకు సన్మానం చేసి దృశ్యాలవాలతో సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ కలయిక జీవితాంతం గుర్తుండిపోయేలా జరిగిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కాలేజీ కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ వి ఎస్ ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి ఎన్ ప్రసాద్, అల్యూమిని డీన్ ప్రొఫెసర్ ఎన్ అమర్నాథ్ రెడ్డి, కాలేజీ యాజమాన్యం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ లో స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం

**కురబలకోట, జులై 19 తర్వాత వార్త**
అంగళ్ళు సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె కళాశాలలోని ఎం.సి.ఏ విభాగం వారు మరియు మిట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "హెల్పింగ్ హాండ్స్" కార్యక్రమాన్ని మదనపల్లెలోని చైతన్య ఫౌండేషన్ లో విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎం.సి.ఏ మొదటి సంవత్సరం విద్యార్థులు దాదాపు 100 మంది లబ్ధిదారులకు రైస్ బ్యాగులు, నూనె ప్యాకెట్లు, నోట్‌బుక్స్ మరియు ఇతర అవసరమైన నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్. మారుతముత్తు, డా. జూడ్ మోసెస్ అంటో దేవకాంత్, శ్రీమతి కె. కవిత కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. మొత్తం 50 మంది మొదటి సంవత్సరం ఎం.సి.ఏ విద్యార్థులు ఈ సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని సమాజంపై విభాగం యొక్క సామాజిక బాధ్యతను ప్రతిబింబించారు.




## ప్లాస్టిక్ నిషేదిద్దాం
# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**
ప్లాస్టిక్ నిషేదిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదామంటూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమీషనర్ ప్రమీళ ఆధ్వర్యంలో పట్టణంలోని బర్మావీధి రామారావు మున్సిపల్ పాఠశాలలో ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రతి నెల 3వ శనివారం ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తాందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించి పర్యావరణ పరిరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడడం వల్లకలిగే అనర్థాలాను ప్రజలకు వివరించాలన్నారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని కోరారు. ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి కాలుష్య నియంత్రణకు కృషి చేయాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య నివారణ పనులు కూడా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్రపై ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాంధీ, మాజీ కౌన్సిలర్ బాబునాయుడు, సంఘం హరి, నవీన్‌చౌదరి, జేసిబి మధు, ఆర్‌ఎస్‌ఎస్ షంషీర్, నాదేళ్ళ శివప్రసాద్, రెడ్డిబూ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న బుద్ధిని నాటకం



బుద్ధిని నాటకం వేస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :**
భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో అభ్యుదయ అర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో బుద్ధినితో ప్రయాణం డాక్టర్ అంబేద్కర్ నాటిక ప్రజలను ఆకట్టుకొంది. ఈ నాటకంలో బుద్ధిని బోధనలు, త్రిశరణాలతో సభా ప్రాంగణం పరిమళించింది. పట్టణంలోని సిఎస్ఐ జేసిఎం కమ్యూనిటి హాల్‌లో బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ నాటికను నిర్వహించారు. ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నేటి మానవాళికి బుద్ధుని బోధనలు ఎంతో అవసరం ఉందన్నారు. బౌద్దుని బోధనలు, బౌద్దాన్ని అక్కున చేర్చుకొన్న దేశాలు ఎంతో అభివృద్ధి దిశలో ఉన్నాయన్నారు. బౌదాన్దన్ని ఆధునిక సమాజానికి అన్వయించి ఆచరించేదే అంబేద్కర్ చూపిన మార్గమని బుద్దినితోనా ప్రయాణం నాటికలో స్పష్టంగా చూపించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు ప్రముఖులు బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, అంబేద్కర్ వాదులు, ప్రభుత్వ శాఖల అధికారులు, కళాప్రియులు, విద్యార్థులు, యువకులు అధికసంఖ్యలో విచ్చేసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపి రెడ్డప్ప, గంగారపు రాందాస్‌చౌదరి, దళిత సంఘా ఐక్యవేధిక కన్వీనర్ మునుస్వామి, పోతబోలు రెడ్డప్ప, కెవి.రమణ, శ్రీచందు, ముత్యాలమోహన్, నీరుగట్టి రమణ, అబూబక్కర్‌సిద్దిక్, అనందన్, చాట్ల బయన్న, తెట్టు శ్రీనివాసులు, జనార్థన్, సచిన్, ముల్లంగి క్రిష్ణయ్యతదితరులు పాల్గొన్నారు.



## మజా..మజా..గా వుంది

**తంబళ్లపల్లె జూలై 19 ప్రభాతవార్త :**
మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఓ వానరం ఎవరో తాగి వదిలేసిన మాజా కూల్ డ్రింక్ బాటిల్ తాగుతూ విన్యాసం ప్రదర్శించింది. వానర విన్యాసం చూసి అధికారులతో పాటు చూపరులు ఔరా అంటూ నువ్వ కోవడం విశేషం.

## వైభవంగా శ్రీ ఎల్లమ్మదేవి తిరుణాల



**పీలేరు జూలై 19 ప్రభాతవార్త :**
పీలేరు చిత్తూరు జాతీయ రహదారి సమీపంలో మోడల్ కాలనీ వద్ద గ్రామదేవత శ్రీ ఎల్లమ్మ దేవీ తిరుణాలలో భాగంగా శనివారం ఉదయం ధర్మకర్త దేవిరెడ్డి వెంకటరమణ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.




## పోలీస్ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన



**బద్వేల్ అర్బన్ జూలై 19: ప్రభాత వార్త :**
బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, బయనపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర హై స్కూల్‌లో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ రూరల్ సీఐ నాగభూషణ్ విద్యార్థులతో మమేకమై, వారికి సమాజం పట్ల బాధ్యత, భద్రత మరియు నైతిక విలువలపై చక్కటి సందేశం అందించారు, విద్యార్థులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, చిన్నారులపై నేరాలు, మొబైల్ వినియోగం దుర్వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు, డిజిటల్ భద్రత, శక్తి యాప్ ప్రాధాన్యత వంటి ప్రధాన అంశాలపై సీఐ అవగాహన కల్పించారు. మ్నుఖ్యగా సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే అపరిచిత వ్యక్తుల పరిచయాలు చాలా ప్రమాదకరం అని విద్యార్థులను హెచ్చరించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు, చదువుతోపాటు పోలీస్ చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, ఈ అవగాహన కార్యక్రమంలో బద్వేల్ రూరల్ ఎస్ఐ కే. శ్రీకాంత్, అలాగే పాఠశాల కరస్పాండెంట్ రాజమోహన్ రెడ్డి, మరియు పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దీపక్ రెడ్డిరెడ్డిని కలిసిన తెలుగు తమ్ముళ్లు

**సిద్ధవటం జూలై 19 ప్రభాతవార్త :**
రాజంపేట పార్లమెంటు ఇంచార్జ్ జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్ధవటం మండలం తెలుగు తమ్ముళ్లు మదనపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు రాయలసీమ జోన్ ఫోర్ ఇంచార్జ్, మరియు సీడప్ ఏపీ చైర్మన్ దీపక్ రెడ్డి ని, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు, చమర్తి జగన్మోహన్ రాజు, నియోజకవర్గ అబ్జర్వర్ చిట్టిబాబు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి సాల్వతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి మండలంలోని పలు విషయాలను దీపక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జ్, దారపునేని దశరథ రామా నాయుడు, మాజీ సర్పంచ్, జంగిటి రాజేంద్ర ప్రసాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు



## ప్లాస్టిక్ వద్దు గోన సంచలే ముద్దు



**బ్రహ్మంగారిమఠం జూలై 19 ప్రభాతవార్త**
బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సర్కిల్ నందు "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర " కార్యక్రమం నిర్వహించిన పంచాయితీ సెక్రటరీ ప్రభాకర్ ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు, శీలం నరసింహ గౌడ్ పాల్గొని ప్లాస్టిక్ వాడకం వలన జరుగు ప్రమాదాలపై తగు సూచనలు ఇస్తూ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ముడుమాల పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర.. ప్లాస్టిక్ కాలుష్యమునకు అంతం కార్యక్రమంలో పాల్గొన్న ముడుమాల సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ మరియు సచివాలయ ఉద్యోగులు, ప్రజలు తదితరులు. అలాగే అన్ని పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్లాస్టిక్ వాడకంతో
# మానవాళికి పెనుముప్పు

**చిట్వేలి, జూలై 19, ప్రభాతవార్త:**
ప్లాస్టిక్ వాడటం వలన మానవాళికి అనారోగ్యంతో పాటు, పర్యావరణానికి పెనుముప్పు తప్పదని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహనతోనే నివారణ సాధ్యమన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్లాస్టిక్ జీవితకాలం మరియు కలిగే నష్టాలను కృత్యం ద్వారా పిల్లలకి వివరించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఎ.కళావతి, టి.సుహాసిని ఎ.శివన్నారాయణ లు విద్యార్థులచే పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం నుంచి ఎలా కాపాడాలో ర్యాలీ ద్వారా నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్న బాబు, ఐసిడిఎస్ సిబ్బంది మరియు విద్యార్థులు




## ముగిసిన ఆషాడ మాస పూజా కార్యక్రమం

**బద్వేలు, జూలై 19, ప్రభాతవార్త**
బద్వేల్ నియోజకవర్గం లోని వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నందు ఆషాడమాసం ప్రారంభంతో నాల్గవ చివరి శనివారం సందర్భంగా వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించారు. తదుపరి స్వామి ,అమ్మవారు ప్రత్యేక అలంకరణ విభూది గంధం గంధముతో నిజరూప దర్శనంలో స్వామి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి నుంచి శ్రావణమాసం మొదటి శనివారం ప్రారంభం అవుతుంది, శ్రావణమాసంలో స్వామివారికి అభిషేకాలు పూజా కార్యక్రమంలోని శ్రావణమాసంలో స్వామివారి అభిషేకం, పూజా కార్యక్రమంలో పాల్గొన్న వారికి దాంపత్య సమస్యలు, సంతాన సమస్యలు తొలగిపోయి అనుకున్న పనులు సకాలం లో నెరవేరుతాయన్నారు. కావున భక్తులందరూ శ్రావణమాసంలో స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి అభిషేకం, పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి సంపూర్ణ ఆశీర్వచనం స్వామి వారి వస్త్రం స్వీకరించవలసినదిగా స్వామి వారు తెలియజేశారు. తదుపరి స్వామి వారిని దర్శించడం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.






తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొందిన పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

**కడప జిల్లా**

పోరుమామిళ్ళ, జమ్మలమడుగు, చెన్నూరు, కొండాపురం, ఎర్రగుంట్ల రూరల్, గోపవరం, అట్లూరు, సికెదిన్నె, కడపక్రైమ్

**అన్నమయ్య జిల్లా**

వాయల్పాడు, రైల్వేకోడూరు, వీరబల్లి, రాయచోటి, నందలూరు, కలకడ

ఇంటర్వ్యూ తేది : 24.07.2025
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086